క్లుప్తంగా

వర్ధంతి సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గెడం సుభాష్

తిర్యాణి: ఈనెల 27న కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే కుమురంభీం 83వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ డివిజన్ ఉపాధ్యక్షుడు గెడం సుభాష్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి తోడసం భాస్కర్, నాయకులు కోట్నాక గణపతి, రాము, అర్జున్ ఉన్నారు.

ఉపాధ్యాయుడొచ్చారు..

సాక్షి ఎఫెక్ట్..

తిర్యాణి: మండలంలోని మాణిక్యపూర్ పంచాయతీ పరిధిలోని బుగ్గరామన్న గూడెంలో నెలకొన్న సమస్యలపై 'ఏళ్లుగా కష్టాలు' అనే శీర్షికన ఈనెల 8న సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అందులో ఆ గ్రామంలోని పాఠశాలలకు ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఐటీడీఏ శాఖ అధికారులు స్పందించి పాఠశాలకు గురువారం నుంచి ఉపాధ్యాయుడిని నియమించారు.

మద్యం పట్టివేత



బెజ్జూర్: స్వాధీనం చేసుకున్న మద్యం

బెజ్జూర్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై విక్రమ్ హెచ్చరించారు. కృష్ణపల్లి సమీపంలో రూ.21వేల మద్యాన్ని పట్టుకున్నారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలో గురువారం ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ ఆధ్వర్యంలో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కాలనీకి చెందిన శైలేశ్, రంజిత్‌ల నుంచి 7లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడుంబా పట్టివేత

రెబ్బెన: గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సయ్యద్ మోసిన్ అలీ హెచ్చరించారు. మండలంలోని దేవులగూడ గ్రామ పరిసరాల్లో గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన 540 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా.. విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకునేందుకు వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేతనాలు రాక పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో కార్మికులు రత్నం దేవాజీ, వెంకటేశ్, సునీల్, లాల్‌సింగ్, ప్రవీణ్, కిషన్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి'

జైనూర్: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ అన్నారు. గురువారం మండలంలోని పట్నాపూర్ పులాజీబాబా ఆలయం నుంచి బీజేపీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోవ విజయ్, రాథోడ్ సందీప్, చహక్కటి గణేశ్, ఆత్రం అర్జున్ ఉన్నారు.

రాయల్ ఎన్ ఫీల్డ్ విజేత సతీష్



బైక్ అందిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌రూరల్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన వాణిజ్య గణేష్ మండలి శారద దేవి వద్ద నిర్వహించిన రాయల్ ఎన్ ఫీల్డ్ లక్కీ డ్రా బుధవారం రాత్రి నిర్వహించారు. ఇందులో మందమర్రికి చెందిన సతీష్ (టోకెన్ 415) విజేతగా నిలిచారు. ద్వితీయ బహుమతి ఎల్ఈడీ టీవీ రాజేశ్వరి లక్కీ డ్రాలో సొంతం చేసుకుంది. తృతీయ బహుమతి ఫ్రిడ్జ్ లేడిగూడకు చెందిన స్నేహకు దక్కింది. నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాటు చేసి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్, బాబు, గిరిష్, మురళి పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

- అంతర్రాష్ట్ర రహదారిలో రెండు చెక్‌పోస్టులు
- క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు
- 24 గంటల పాటు తనిఖీలు
- పట్టుబడుతున్న నగదు
- ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచన



సిర్పూర్(టి) - మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో హుడ్కిలి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిర్పూర్(టి) మండలం మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారుల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సిర్పూర్(టి)-మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్-పోడ్సా అంతర్రాష్ట్ర రహదారులతో పాటు సిర్పూర్(టి)-కౌటాల, సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారుల్లో కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేశ్ పోలీసులతో కలిసి తనిఖీలు ముమ్మరం చేశారు. 24గంటలు అంతర్రాష్ట్ర రహదారిలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను నిత్యం తనిఖీ చేస్తూ ఎన్నికల నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తున్నారు. నిబంధనల మేరకు వాహనాల్లో వస్తువులతో పాటు నగదును తరలించుకోవాలని సూచిస్తున్నారు. అంతర్రాష్ట్ర రహదారుల్లోని వాహనాల్లో రూ.50వేలకు మించి నగదు తరలిస్తున్న వాహనదారుల వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని జప్తు చేస్తున్నారు. మండలం మీదుగా అంతర్రాష్ట్ర రహదారుల్లో ప్రయాణించే ప్రయాణికులతో పాటు కౌటాల, కాగజ్‌నగర్ మండలాలకు వెళ్లే వాహనదారులు అప్రమత్తమవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటే ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలను విక్రయించేందుకు సిర్పూర్(టి) మండలం మీదుగా అంతర్రాష్ట్ర రహదారుల గుండా మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి, అహెరి, రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, వని తదితర పట్టణాలకు వెళ్తుంటారు. పంట విక్రయించగా వచ్చిన నగదును తీసుకురావడంలో ఇబ్బందులు పడతారని రైతులు వాపోతున్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రూ.లక్షా 50వేల నగదు స్వాధీనం

ఇప్పటి వరకు సిర్పూర్(టి) మండలం మీదుగా వెళ్లే వెంకట్రావ్‌పేట్-పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని ఎన్నికల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం కౌటాల సీఐ సాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్‌లు ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 50వేల నగదును పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.



వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి. నగదు తరలింపుతో పాటు ఇతర సామగ్రిని తరలింపుతో పాటు వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు. అత్యవసర సమయాల్లో నగదు తరలింపు కోసం అనుమతి పత్రాలు వెంట తెచ్చుకోవాలి.

\- డికొండ రమేశ్, ఎస్సై, సిర్పూర్(టి)

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు



దహెగాంలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

దహెగాం/పెంచికల్‌పేట్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తామని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. గురువారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో కవాత్ నిర్వహించారు. దహెగాం మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఇట్యాల, కోత్మీర్ గ్రామాల్లో కవాతు నిర్వహించి మాట్లాడారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. 45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సైలు సనత్‌కుమార్, కొమురయ్య, రమణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు వందశాతం హాజరు కావాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అబీద్ అలీ

తిర్యాణి: ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని జెండర్ అండ్ ఈక్విటీ కో- ఆర్డినేటర్ అబీద్ అలీ అన్నారు. గురువారం మండలంలో మాణిక్యపూర్ కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వెళ్లిన విద్యార్థులు త్వరగా పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న, సీఆర్పీ దామోదర్ ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఇందాని సబ్ హెల్త్ సెంటర్ పరిధిలోని నవేగూడ గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన నిర్వహించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు అందించారు. జ్వరాలతో ఉన్న వారి నుంచి పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. అనంతరం గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో, డ్రెయినేజీల్లో యాంటిలార్వా మందులు వేశారు. డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్, ఏఎన్ఎం కాంత, ఎంఎల్‌హెచ్‌పీ సుచరిత పాల్గొన్నారు.

'రైతుబంధుపై విషం కక్కుతున్న కాంగ్రెస్'



రెబ్బెన: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జైనూర్: మానిక్‌రావు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కెరమెరి: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన: రైతులకు పంట పెట్టుబడి సాయం అందించే రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రైతుబంధుపై విషం కక్కుతోందని రెబ్బెన సర్పంచ్ అహల్యాదేవి, గంగాపూర్ సర్పంచ్ పందిర్ల వినోద అన్నారు. రైతుబంధును నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయటాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంతో పాటు గంగాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేరువేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉత్తంకుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తూ రైతంగానికి చేదోడు వాదోడుగా నిలుస్తుంటే కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతుబంధు సమితి జిల్లా నాయకురాలు శంకరమ్మ, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, నాయకులు చిరంజీవిగౌడ్, భరద్వాజ్, శంకర్, శ్రీధర్, ఆనంద్, వినోద్‌జైస్వాల్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాల పార్టీ కాంగ్రెస్

జైనూర్: రైతు వ్యతిరేక విధానాల పార్టీ కాంగ్రెస్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు మానిక్‌రావు ఠాక్రే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల అభివృద్దే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఈసీకు దరఖాస్తు చేయడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వక్రబుద్ధిని గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్ ఉన్నారు.

ఉత్తమ్ కుమార్ దిష్టి బొమ్మ దహనం

కెరమెరి: రైతుబంధు పథకాన్ని నిలిపి వేయాలంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ నాయకులు కెరమెరి ప్రధాన రహదారిపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేక పోతోందన్నారు. వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇఫ్తేకార్, నాయకులు పెందోర్ ఆనంద్‌రావు, కేంద్రె బాలాజీ, జాహెద్, నాందేవ్, ప్రకాశ్ ఉన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



ప్రచారం నిర్వహిస్తున్న శ్యామ్‌నాయక్

తిర్యాణి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు అజ్మీర శ్యామ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని భీంజిగూడ, చింతల మాదర, పంగిడి మాదర, సుంగాపూర్, తలండి, గంభీరావుపేట గ్రామాల్లో ఆరు గ్యారెంటి పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటి పథకాలను ఖచ్చితంగా అమలు పరుస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి 200యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామన్నారు. ఇళ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్నం కుమార్, మాజీ ఎంపీటీసీ జుమ్మిడి కిష్టయ్య, నాయకులు పెరుమండ్ల వెంకటేశం, శ్రవణ్, రాహుల్ ఉన్నారు.

'బీఎస్పీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదు'



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

పెంచికల్‌పేట్: బీఎస్పీ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని పార్టీ మండల అధ్యక్షుడు దేవాజీ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సిర్పూర్ గడ్డపై బీఎస్పీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యకర్తలు కృషి చేసి పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి సోయం చిన్నన్న, అసెంబ్లీ ఇన్‌చార్జి రాంప్రసాద్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాబాజీ, మండల ఇన్‌చార్జి షరీఫ్, ఆశన్న పాల్గొన్నారు.

ఎస్అండ్‌పీసీ చెక్‌పోస్టులకు మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీలోని ఎస్అండ్‌పీసీ చెక్‌పోస్టు వద్ద వసతులు కల్పించి ఆధునీకరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. ఈ మేరకు గురువారం సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం రాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సెక్యూరిటీ గార్డు చెక్‌పోస్టు వద్ద దుమ్ముధూళి అధికంగా వస్తుండడంతో ఎస్అండ్‌పీసీ సిబ్బంది అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చెక్‌పోస్టులో ఏసీ సౌకర్యం కల్పించాలన్నారు. చెక్‌పోస్టు కిటికీ అద్దాలకు కూలింగ్ గ్లాస్‌లను అమర్చాలని డిమాండ్ చేశారు. చెక్‌పోస్టుల వద్ద మంచినీటి సౌకర్యం, చెక్‌పోస్టు ఎదుట ఉన్న మెట్లకు ఇరువైపుల రేలింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వంతెన వరకు మూడు షిఫ్టులలో వాటర్ స్ప్రే చేయించాలని కోరారు. యాజమాన్యం తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, సీహెచ్‌పీ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, ఏరియా ఆర్గనైజర్ ఇనూస్ పాల్గొన్నారు.

కుమురంభీంకు నివాళి



సమాధికి మొక్కుతున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో గురువారం మహారాష్ట్రలోని గడ్‌చందూర్, నార్నూర్ మండలానికి చెందిన ఆదివాసీలు ఘనంగా నివాళి అర్పించారు. భీం సమాధికి ప్రత్యేక పూజలు చేశారు. జెండాల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. ప్రస్తుతం దేవతల నెల ప్రారంభం కావడంతో కుమురం వంశస్తులు ఇలా మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. అనంతరం భీం మ్యూజియాన్ని పరిశీలిచారు. అందులోని ఆది వాసీల సాంప్రదాయల ఆభరణాలను తిలకించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపక పోస్టులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య ప్రకటనలో పేర్కొన్నాడు. సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, ఆ పై అర్హత గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, అభ్యర్థులు తప్పనిసరిగా పీజీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై, డిగ్రీ స్థాయిలో బోధన అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీన సాయంత్రం నాలుగు గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమయపాలన పట్టని సార్లు



తెరుచుకోని పాతబూరెపల్లి పాఠశాల



ఉపాధ్యాయుల కోసం బొగదగూడ విద్యార్థులు

- పునః ప్రారంభం రోజే గైర్హాజరు
- తెరుచుకోని పాఠశాలలు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు

చింతలమానెపల్లి: పాఠశాలలో క్రమశిక్షణ నేర్పిస్తుంటారు. కానీ క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయులే సమయపాలన తప్పి పాఠశాలకు హాజరవుతున్నారు. చిత్తశుద్ధి లేని బోధనతో విద్యార్థుల భవిష్యత్ అధోగతి పాలవుతోంది. దసరా సెలవులను ప్రభుత్వం పాఠశాలలకు ఈ నెల 13వ తేదీ నుంచి 13రోజుల పాటు సెలవులు ప్రకటించింది. సెలవుల అనంతరం తిరిగి 26వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభించారు. కానీ పలు పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో పాటు మరి కొందరు ఆలస్యంగా విధులకు చేరుకున్నారు.

మండలంలో పరిస్థితి..

మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు వంతుల వారీగా నియమించుకుని విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మండలంలో గురువారం పాఠశాలల పునఃప్రారంభించాల్సి ఉండగా పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయం తప్పి ఆలస్యంగా హాజరయ్యారు. మండలంలోని నందికొండ పాఠశాలలో ఉపాధ్యాయురాలు సౌజన్య రాకపోవడంతో వంట కార్మికురాలు మధునక్క, విద్యార్థులే పాఠశాలను తెరిచారు. రణవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 9.45 నిమిషాలకు ప్రార్థన గీతాలాపన నిర్వహిస్తుండగా ఐదుగురు ఉపాధ్యాయులకు కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. బూరెపల్లి గ్రామపంచాయతీలోని బొగదగూడ పాఠశాలలో 10గంటల వరకు ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, పద్మలతలు హాజరు కాలేదు. ఇదే పంచాయతీలోని పాతబూరెపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ 10.30 నిమిషాల వరకు హాజరుకాక పోవడంతో పాఠశాల తెరుచుకోలేదు. సదరు ఉపాధ్యాయుడు ఫోన్‌లో మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి వస్తున్నానని, రావడానికి ఆలస్యమైందని తెలిపాడు. మండలంలోని గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు గీతాంజలి, తానుబాయి, మరో ఉపాధ్యాయురాలు అర్చన సకాలంలో పాఠశాలకు హాజరయ్యారు. ఉపాధ్యాయుడు సెడ్మరావు ఆలస్యంగా హాజరు కాగా ప్రధానోపాధ్యాయుడు 10గంటల వరకూ రాలేదు. ఇదే ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు హాజరు కాక విద్యార్థులు ఖాళీగా తరగతి గదుల్లో కూర్చున్నారు. గత ఏడాది నిర్వహించిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. మండలంలోని గూడెం ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు తరచూ గైర్హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి. మండలానికి రెగ్యులర్ విద్యాధికారి లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆన్‌డ్యూటీ పేరిట ఎగనామం..

పాఠశాలలు నిర్వహించే ఉపాధ్యాయులు పాఠశాలలకు ఎగనామం పెట్టడానికి కొత్త ఎత్తుగడలు చేపడుతున్నారు. గురువారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌డ్యూటీ కారణంతో పాఠశాలలకు గైర్హాజరయ్యారు. పాఠశాలల పునః ప్రారంభం రోజు పాఠశాలల్లో శుభ్రత, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించాల్సిన ప్రధానోపాధ్యాయులు ఆన్‌డ్యూటీ పేరిట గైర్హాజరు కావడం గమనార్హం

హాజరుశాతం తక్కువే..

ఆసిఫాబాద్‌రూరల్: దసరా సెలవుల అనంతరం గురువారం తిరిగి పాఠశాలలు ప్రారంభం కాగా విద్యార్థుల హాజరు 50శాతం మాత్రమే నమోదైంది. జిల్లా వ్యాప్తంగా డీఈవో పరిధిలో 684 పాఠశాలలున్నాయి. వీటిలో 39,890 మంది విద్యార్థులు ఉన్నారు. గురువారం తిరిగి పాఠశాలలు ప్రారంభం కాగా 50శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే దూర ప్రాంతం నుంచి వచ్చే ఉపాధ్యాయులు సరైన సమయానికి రాకపోవడంతో కొంత మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చి తిరిగి వెళ్లిపోయారు.

చర్యలు తీసుకుంటాం

పాఠశాలలు సరిగా నిర్వహించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం. పాఠశాలలకు ఆలస్యంగా వచ్చినా..పాఠశాలలు తెరవకపోయినా చర్యలు తప్పవు. మండల అధికారులతో నివేదిక తీసుకుని అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

\-అశోక్, జిల్లా విద్యాధికారి

పరామర్శ

ఆసిఫాబాద్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు బోనగిరి సతీశ్ బాబు తల్లి అనారోగ్యంతో మృతి చెందగా గురువారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ పరామర్శించారు. సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, సయ్యద్ నిసార్ ఉన్నారు.